# తైల వర్ణ (వి) చిత్రం

- కలశపూడి శ్రీనివాసరావు




న్యూయార్కు నగరం పొలిమేరలో ఉంది మా ఇల్లు. అందువల్ల అర్థరాత్రి అయినా సరే మా ఆవిడతో పాటు ఓ రెండు మైళ్ళు అటు ఇటు వాకింగ్‌కు వెళ్ళడానికి వీలవుతుంది. ఆకురాలు కాలం ప్రారంభం అవ్వగానే మారీ మారని ఆకులు వివిధ రంగులు సంతరించుకుంటున్న ఒకానొక రోజు సాయంత్రం తొమ్మిది గంటలకి భోజనం చేసి 'వాక్'కి వెళ్ళాం. దార్లో ఉన్న ఓ బస్ స్టాప్‌లో ఓ ఆఫ్రో అమెరికన్ (వాళ్ళని నల్లవాడు అని అనకూడదని మావాడికి స్కూల్లో నేర్పింది వాడు మాకు ఇంట్లో నేర్పేడు) భుజానికో సంచి, చేతిలో ఓ చిన్న పెట్టెతో ఒంటరిగా బస్ కోసం ఎదురు చూస్తున్నాడు. మేం మా వాకింగ్ పూర్తి చేసుకొని వెనక్కి వస్తుంటే మళ్ళీ అక్కడే కనిపించాడు దూరం నుండే

"ఆఖరి బస్ మిస్సయ్యేడేమో" అంది కరుణ అని పిలవబడే మా ఆవిడ కె.అరుణ.

"అంటే అతన్ని ఇప్పుడు మనింటికి తీసుకెళ్ళి ఈ రాత్రి ఉంచాలనా నీ ఉద్దేశ్యం" అన్నాను భాషకి అందని భావాల్ని పదాల మధ్య 'స్మగ్లింగ్' చేసే మా ఆవిడ తత్వం తెలిసిన నేను, "వద్దన్నానా?" ఆమె సంక్షిప్త, సాధికార సమాధానం ప్రశ్నగా.

"ఇప్పటికే ఇల్లు 'సత్రం' చేసానంటున్నావ్" అని ఆగిపోయాను.

"అన్నా అనకపోయినా అయ్యేది అదేగా" అంది నవ్వుతూ.

ఇంతలో బస్ స్టాప్ కి వచ్చాం.

"లాస్ట్ బస్ మిస్ అయ్యారా?" అని అడిగాను ఇంగ్లీషులో

"లాస్ట్‌బస్ ఎప్పుడు?" అని వచ్చీరాని ఫ్రెంచ్ యాసతో అడిగాడు.

బహుశా పూర్వం ఫ్రెంచి వాళ్ళు పాలించిన ఏ ఆఫ్రికా దేశస్థుడో అయి ఉంటాడని అనుకొని మనకొచ్చిన ఫ్రెంచి భాష వెలగబెట్టడానికి అవకాశం వచ్చింది కదా అని మనసులో సంతోషించి ఫ్రెంచిలో సంభాషణ సాగించాం.

బస్ స్టాప్‌లో ఉన్న టైం టేబుల్ చూసాను. లాస్టు బస్ వెళ్ళిపోయింది. మర్నాడు ఉదయం 5.30 నిముషాలకు మొదటి బస్ ఉంది. ఇక్కడ టాక్సీ దొరకాలంటే ఫోను చెయ్యాలి అని చెప్పాను. ఇక్కడ నుండి మెన్‌హటన్‌లో ఉన్న పోర్టు అథారిటీ బస్ టెర్మినస్, అంటే (పై ఊర్లు వెళ్ళే బస్ స్టేషన్) వెళ్ళాలంటే ఎంతవుతుంది అని అడిగాడు అతను.

"సుమారు 50 డాలర్లు అవుతుంది" అని చెప్పాను.

"చాలా ఎక్కువే" అని తటపటాయించాడు.

మా ఆవిడ నేత్రావధానంతోనే "మరెందుకు టైమ్ వేస్టు, పిలువు, రాత్రి మనింట్లోనే ఉండి ఉదయం బస్‌లో వెళ్ళమను" అంది.

అడగ్గానే వెంటనే ఒప్పేసుకొన్నాడు.

కమరూన్ అనే ఆఫ్రికా దేశస్తుడట. విజిటర్‌గా అమెరికా వచ్చాడట. క్వీన్స్‌లో ఉన్న స్నేహితునితో ఉందామని అతని ఎడ్రస్ ప్రకారం వెళితే ఆ ఫ్రెండ్ ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయి చాలా రోజులైందని ఆ ఇంట్లో వాళ్ళు చెప్పారట. అంచేత ఇప్పుడు మెన్‌హటన్ వెళ్ళి అక్కడ నుండి వాషింగ్టన్ (డిసి) అన్న ఊరు వెళ్ళాలిట. ఈ విషయాలు అన్ని చెపుతుండగానే మా ఇల్లు వచ్చేసింది. అతని కో గెస్టు బెడ్‌రూమ్ చూపించి పడుకోమన్నాం.

అలా వచ్చి ఆ రాత్రి ఉన్న వ్యక్తి ఉదయం వెళ్ళిపోతూ ఓ తైల వర్ణ చిత్రం ఇచ్చాడు మేం చేసిన సహాయానికి కృతజ్ఞతతో. అది మోడ్రన్ ఆర్టులా ఉంది. దానిని ఆ రాత్రే మా ఇంట్లో

వేశాడుట. అది మా కర్థం కాకపోయినా ఇచ్చాడుకదా అని ‘మర్సి‘ (ఫ్రెంచిలో కృతజ్ఞతని సూచించే పదం) అని ఆ తైల వర్ణ చిత్రం తీసుకొన్నాను. అతను వెళ్ళిపోయాడు. మేం దాన్ని మా లైబ్రరీ గదిలో ఓ మూల పెట్టి మరిచిపోయాం దాని గురించి.

కొన్ని నెలల తరువాత చాలా మంది అమెరికన్‌ల లాగానే "స్ప్రింగ్ క్లీనింగ్" అని ఇంట్లో ఉన్న చెత్త అంతా తీసి పారేసే కార్యక్రమంలో ఈ అర్థం కాని ఆర్టుని ఏం చెయ్యాలి అని ఓ చిన్న చర్చ జరిగింది మా డైనింగ్ టేబుల్ దగ్గర. మోడ్రన్ ఆర్ట్ ఫ్రంకమరున్ ఫర్ సేల్ అని పెన్ని సేవర్‌లో ఎడ్వర్టైజ్ మెంట్ ఇస్తే అన్న మా అబ్బాయి సలహా అమలు పరిచాం. అంతే, ఓ పాతిక ఫోన్ కాల్సు వచ్చాయి. ఓ ఆదివారం అందరిని రమ్మని చెప్పాం.

వచ్చిన వారి కారు బట్టి, వారు ఆ తైల వర్ణ చిత్రం చూసిన తీరు బట్టి మా అమ్మాయి ఆ తైల వర్ణ చిత్రం ధర అతి జాగ్రత్తగా పెంచుకొంటూ పోయింది. సాయంత్రం ఐదు అయ్యింది. "ఎంతో కొంతకి అమ్మేయవే ఇక బయట పార్టీకి వెళ్ళాలి" అని గట్టిగా చెప్పాను. కారు చవకగా అమ్మేస్తున్నానని చెప్తూ ఖరీదైన కారులో వచ్చిన ఒకాయనకి వెయ్యిడాలర్లకి అమ్మేసింది. అతను చెక్కిచ్చి చిత్రం తీసుకొని వెళ్ళిపోయాడు.

తల్లి, "పుత్రిక పుట్టంగ కాదు, ఆ పుత్రిక...." అని పుత్రికోత్సాహాన్ని ప్రదర్శించితే, ఆ చెక్ ఎన్‌కేష్ అయి డబ్బు రానీ అని కొట్టి పారేశాను. నిజంగానే ఆ వెయ్యిడాలర్ల చెక్ ఎన్‌కాష్ అయ్యింది అని తెలియగానే ముందు ఆశ్చర్యపోయాను తర్వాత అయ్యో ఆ చిత్రకారుని చిరునామా తీసుకోలేదే అని బాధపడ్డాను.

"నల్ల వాళ్ళని చూస్తే భయం అనే వాళ్ళకి, ప్రక్కవాడికి, సహాయం చేస్తే ప్రిస్టేజ్ పోతుందనుకునే వాళ్ళకి ఈ కథ చెప్పు. దాని వల్ల ఏ ఒక్కరిలోనైనా, ఎంతో కొంతైనా నల్ల వాళ్ళ మీద మంచి అభిప్రాయం వస్తే, అటు వెయ్యి డాలర్లు ఉత్తినే వచ్చాయే అన్న బాధ ఉండద"ంది మా ఆ విడ.

అంచేత ఈ కథ వేసుకొన్నవారికి, చదివి వినిపించిన వారికి, విన్నవారికి, విని మరొకరికి చెప్పిన వారికి, స్వంత తైలం (కాలం గ్రటా) కొంత పోయినా ఏదైనా విచిత్రం జరుగుతుంది!



డాక్టర్ కలశపూడి శ్రీనివాస రావు న్యూయార్క్ నివాసి. ఆంధ్రా యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత పారిస్‌లో శాస్త్ర పరిశోధన పూర్తిచేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం వృత్తిరీత్యా శాస్త్రవేత్త, ప్రవృత్తి రీత్యా రచయిత, కవి, సంఘసేవకులు.